కౌలురైతు కుటుంబానికి ప్రభుత్వసాయం

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కౌలురైతు రాజవరపు శ్రీనివాసరావు అప్పుల బాధతో గతేడాది మృతిచెందాడు. కాగా కౌలు రైతును ఆదుకునేందుకు సహకరించాలంటూ సర్పంచ్, గ్రామ నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ సాయంగా అతని కుటుంబసభ్యులకు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు రూ.7లక్షల నగదు మంజూరు అయ్యాయి. ఈవిషయాన్ని మృతుడు శ్రీనివాసరావు భార్య మహాలక్ష్మి గ్రామ సర్పంచ్ మేరువ విజయలక్ష్మికి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం తెలియజేసింది. ఆమె మాట్లాడుతూ తన భర్త మృతితో అప్పుల బాధతో ఇక్కట్లు పడుతున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడం సంతోషంగా ఉందని తెలిపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం
కంతంరాజుకొండూరు గ్రామం, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా

సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలము ప్రకటన

గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, కంతంరాజు కొండూరు గ్రామములో వేంచేసి యున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానము నందు ఈ క్రింద ఉదహరింపబడిన వస్తువులను సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలము పాట ద్వారా ది.21-08-2023న సోమవారం ఉదయం 11.00 గం.లకు సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలము పాటల ద్వారా అమ్మకము జరుపబడుచున్నవి. ఆసక్తి గలవారు టెండరు షెడ్యూల్స్ కొరకు ది.09-08-2023 నుండి ది.14-08-2023 వరకు టెండరు షెడ్యూలు కొరకు ధరఖాస్తులు స్వీకరించబడును. టెండరు షెడ్యూలు కొరకు మా కార్యాలయము నందు సంప్రదించవలెను. టెండరు షెడ్యూల్ తో పాటు టెండరు ధరావత్తు రుసుం/ డిమాండ్ డ్రాఫ్టులను జతపరచవలెను. పూర్తి చేసిన ధరావత్తులను ది.21-08-2023న ఉదయం 10.30 గం.ల లోపు సీలు వేసి కవరులో స్వయముగా ఇచ్చిన యెడల స్వీకరించబడును. అదేరోజు ఉదయం 11.00 గం. లకు మా కార్యాలయము నందు బహిరంగ వేలము పాటలు కూడా జరుపబడును. వచ్చిన వారి సమక్షములో పాట ముగిసిన తదుపరి సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరములకు మా కార్యాలయము నందు పని దినములలో సంప్రదించవచ్చును.

వ. సం	పని పేరు	టెండరు షెడ్యూలు ఖరీదు రూ.	ప్రథమ ధరావత్తు రూ.
1	టేకు పాత ధ్వజం-1,టేకు తలుపు చెక్కలు-4	500/-	5000/-
2	పాత ఇత్తడి గంటలు మరియు ఇత్తడి స్క్రాప్, ధ్వజం ఇత్తడి మానికలు (షుమారు 370 కేజీలు)	500/-	5000/-
3	కంచు ఘంటలు (షుమారు 180 కేజీలు)	500/-	5000/-
4	మండపము పడగొట్టాగా వచ్చిన ఇనుము, ఇనుము స్క్రాప్, స్టీల్ స్క్రాప్ (షుమారు 3000ల కేజీలు)	500/-	25000/-

గ్రామము: కంతంరాజు కొండూరు
తేది: 04.08.2023

ఇట్లు/కార్యనిర్వహణాధికారి
Cell: 9848511556

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగరంలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నగర పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. కార్పొరేషన్ పరిధి బేతపూడి బాబూజీనగర్‌లో సీఆర్‌డీఏ అధికారులు సిటీస్ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్దిష్ట సమయంలో నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బేతపూడి బాబూజీనగర్, దళిత శిబిరంలో తుదిదశకు చేరుకున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణాలను పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. అనంతరం నగరంలోని నిడమర్రు రైల్వేగేటు వద్ద డంపింగ్ యార్డు ఆవరణలో చేపట్టిన ఉద్యానవనం పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు ఆకురాతి రాజేష్, సంకా బాలాజీగుప్తా, శేషిరెడ్డి, బేతపూడి నర్సయ్య, మహిళా నాయకురాలు మల్లవరపు సుధారాణి పాల్గొన్నారు.

పుష్కరిణికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యం

నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన చారిత్రాత్మక కళ్యాణ పుష్కరిణి (పెద కోనేరు)కి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. కళ్యాణ పుష్కరిణి పూడికతీత పనుల్లో 1870-1890 మధ్య కాలం నాటి బంగారు, రాగి నాణేలతోపాటు స్వామి వారి పూజా



ఉద్యాన వనం ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

సామాగ్రి బయటపడగా శుక్రవారం వాటిని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్యే మురుగుడు హనుమంతరావులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ వాటిని తహసీల్దార్‌కు అప్పగించామని చెప్పారు. రానున్న రెండు మూడు రోజుల్లో ఎండోమెంట్ ఇంజినీరింగ్ అధికారులతో కోనేరు దిగువ భాగం నుంచి పునరుద్ధరించేందుకు తగు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామన్నారు. భవిష్యత్తులో కళ్యాణ పుష్కరిణిని అతి పవిత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి కళ్యాణ పుష్కరిణి పునరుద్ధరణ పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తాం

కళ్యాణ పుష్కరిణి వెంబడి ఉన్న స్థలంలో బాలాంబ సత్రం నిర్మాణం చేపట్టి ఈ ఏడాది డిసెంబరు నాటికి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. రెవెన్యూ చట్ట ప్రకారం అతి త్వరలోనే బాలాంబ సత్ర స్థలం ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుందని, అనంతరం ఎండోమెంట్ శాఖకు బదలాయింపు చేసి సత్రాన్ని నిర్మించి పుష్కరిణి చూసేందుకు వచ్చే భక్తులకు ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, దేవస్థాన ఈవో అన్నపురెడ్డి కోటిరెడ్డి, పట్టణ సీఐ బి అంకమ్మరావు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేత

తాడేపల్లిరూరల్: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కెఎల్‌రావు కాలనీ, సీతానగరం అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం పట్టణ కన్వీనర్ బాలసాని దేవసుందరం (అనీల్) గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఎస్సీ విభాగం పట్టణ ప్రధానకార్యదర్శి చిలుకోటి శ్రీనివాస మధు, బీసీ విభాగం నాయకులు బత్తుల దాసు, శివాలయం ట్రస్ట్ బోర్డు మెంబర్ రంగారావు పాల్గొన్నారు.

ప్రాతూరులో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి కుంచనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు నాగేంద్రబాబు మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఆర్.సత్యనారాయణరెడ్డి, వజ్రాల నాగిరెడ్డి, ప్రాతూరు కోటేశ్వరరావు, ఎస్.మరియబాబు, డి.సత్యనారాయణరెడ్డి, పి.శ్రీను, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వై.వైదేహి మాట్లాడారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు అందజేశారు. షేక్ సఫియా, డి.భవాని, భూలక్ష్మి, ప్రసన్నకుమారి, వి.స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం జయమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: తల్లిపాలతో బిడ్డకు పరిపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి, సీతారాం, ఆదిలక్ష్మి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధి గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. స్టేట్ ప్రొటెక్షన్ అధికారి డి.విజయ్‌కుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎ.సులోచన, హెల్త్ సెంటర్ మెడికల్ అధికారి పి.అనూష, పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



తాడికొండ: రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తుళ్లూరు కో ఆపరేటీవ్ సొసైటీ చైర్మన్‌గా నాయుడు నాగేశ్వరరావు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. కత్తెర మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీచర్లకు సన్మానం

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూలులో పనిచేసి ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు, పూర్వ ప్రధానోపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. హెచ్ఎం భీతిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడారు.

ఎంఈఓ కార్యాలయం సందర్శన

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం భవనాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, తహసీల్దార్ నాగిరెడ్డి, ఎంఈఓలు నాగేశ్వరరావు, శాంతకుమారిలతో కలసి శుక్రవారం పరిశీలించారు. విద్యాశాఖ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరడం ఆయన గుర్తించారు. ఇంతకాలం తన దృష్టికి ఎందుకు తీసుకురాలేని ఆయన విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. మండల సమావేశ కేంద్రంలోకి మార్చుకోవాలని, అవసరమైన ఏర్పాట్లు ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేస్తారని సూచించారు.